
# ప్రేమే నేరమౌనా!




అది ఒక ప్రముఖ పట్టణంలోని ఒక పెద్ద కళాశాల ప్రాంగణం.

ఆ ప్రాంగణం లోపలా బయటా జన సందోహం.

జనసముద్రాన్ని చీల్చుకుంటూ కార్లు వస్తున్నాయి. బడాబాబులెందరో దిగుతున్నారు.

అక్కడంతా పెద్ద పెద్ద కటౌట్‌లు పెట్టారు. స్వాగత తోరణాలు కట్టారు.

ఆవరణంతటా అమర్చిన లౌడ్‌స్పీకర్లలోంచి చెవులు పగిలిపోయే శబ్దంతో సినిమా పాటలు వినపడ్తున్నాయి.

మరికొద్దిసేపట్లో అక్కడ 'ప్రేమా జిందాబాద్' సినిమా శతదినోత్సవ సభ జరగబోతోంది... అందుకే ఆ హడావిడంతా.

తమ అభిమాన సినిమా తారలను చూసి పులకించి పరవశించిపోయేందుకు వేలాదిగా జనం తరలివచ్చారు. వారిలో కుర్రకారే ఎక్కువ. వారంతా తమ ప్రియతమ కథానాయకుడికి జిందాబాద్‌లు కొడ్తున్నారు.

అయితే ఇక్కడ మనం 'ప్రేమా జిందాబాద్' దర్శక నిర్మాత ప్రకాశరావు గురించి ప్రధానంగా చెప్పుకోవలసి ఉంది.

ప్రేమ గుడ్డిదన్న సూత్రాన్ని గుడ్డిగా అనుసరించి జీవితంలో పైకొచ్చినవాడు ప్రకాశరావు.

ఇవ్వాళ టాలీవుడ్ బిగ్‌విగ్స్‌లో అతడొకడు.

ప్రేమ కథాంశంగా అతడు తీసిన సినిమాలన్నీ సూపర్ డూపర్ హిట్స్.

మరీ ముఖ్యంగా యూత్ అతడి సినిమాల కోసం పడిఛస్తారు - వారే అతడి పెన్నిధి.

అతడి సినిమాల్లో ప్రేమించుకోవడానికి, వలపించుకోవడానికీ అడ్డుగోడలేవీ ఉండవు. ఆస్తులు, అంతస్తులూ ఉండవు. అయినవాళ్ల ఆంక్షలుండవు, సమాజపు కట్టుబాట్లుండవు - మరేమీ ఉండవు.

ఉండేదల్లా ఒక అమ్మాయి - ఒక అబ్బాయి... వారి మధ్య ప్రేమ మాత్రమే.

ప్రేమ అతడి సినిమాల ముడిసరుకు. అది అతడికి ఒక తరగని గని.

ఒక సినిమాలో ఒక మతం అబ్బాయి మరో మతం అమ్మాయిని ప్రేమిస్తాడు.

ఒక సినిమాలో ఒక కులం అమ్మాయి మరో కులం అబ్బాయిని ప్రేమిస్తుంది.

ఒక సినిమాలో ఒక డబ్బున్న అబ్బాయి ఒక పేదపిల్లను ప్రేమిస్తాడు.

ఒక సినిమాలో ఒక గొప్పింటి అమ్మాయి ఒక బీద అబ్బాయిని ప్రేమిస్తుంది.

ఒక సినిమాలో టెన్త్ తప్పిన అబ్బాయి ఒక ఐఎఎస్ అమ్మాయిని ప్రేమిస్తాడు.

ఒక సినిమాలో మెడిసిన్ చదివిన అమ్మాయి ఒక ఆవారాని ప్రేమిస్తుంది.

ఒక సినిమాలో ఒక పెద్ద పోలీసాఫీసర్ కూతురు ఒక పోర్ట్వంటీని ప్రేమిస్తుంది.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. కాస్త అటూఇటూగా ఇలాంటి ప్రేమకథలే అన్నీ...

ఆయా చిత్రాల్లోని ప్రేమజీవులంతా తల్లిదండ్రుల్ని, సంఘాన్ని ఎదిరించి తమ ప్రేమ పండించుకుంటారు.

ప్రతి సినిమాకీ హీరో, హీరోయిన్లను మార్చేయడం ప్రకాశరావు స్పెషాలిటీ. ఎప్పటికప్పుడు ఫ్రెష్ ఫేసెస్‌కై అన్వేషణ జరుపుతుంటాడు. సరిగ్గా డైలాగులు చెప్పడం రాకపోయినా సరే, నటనలో బొత్తిగా అప్రంటీసులైనా సరే, విగ్రహపుష్టికలవారైతే చాలు.

ఏదో కొన్ని లొల్లాయి పదాలతో నవకవులు పాటలు రాసేస్తారు. వచ్చీరాని తెలుగులో పరభాషా గాయకులు పాటలు పాడేస్తారు. ఏవేవో రణగొణ ధ్వనులతో సంగీత దర్శకులు సంగీతం సమకూరుస్తారు.

అలా అలా ఓ సినిమా తయారైపోతుంది. జనం నుంచి డబ్బులు దండుకుంటుంది.

ఆ రోజు సభలో పాల్గొన్న సినీ ప్రముఖులంతా ప్రకాశరావుని ఆకాశానికెత్తారు. అతడికి

## బులుసు వెంకటకామేశ్వరరావు

నిలువెత్తు దండలు వేసారు.

ఈ బాగోతమంతా 'ఇడియట్ బాక్స్'లో ప్రత్యక్షంగా చూస్తున్న రమణారావుగారికి బీపీ పెరిగిపోతోంది.

ఆయనేమీ సినిమా ద్వేషి కాదు. కాకపోతే 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' బాపతువాడు. ఎందరో మహానుభావులు తీర్చిదిద్దిన అద్భుతమైన కళ సినిమా. అది ఈనాడు ప్రకాశరావు వంటి మరుగుజ్జుల చేతిలో పడి కళతప్పడం ఆయన కెంతో బాధగా ఉంటుంది.

మరీ ముఖ్యంగా ప్రేమే ముఖ్యాంశంగా వస్తున్న ఇవాల్టి సినిమాలు యువతను చెడ గొడ్తున్నాయని ఆయన ఫిర్యాదు.

ఆ సినిమాలు చూసి కుర్రకారు వేడిక్కిపోతు న్నారని, ఉన్నతమైన లక్ష్యాలేవీ లేకుండా ప్రేమిం చడమే జీవిత పరమావధిగా భ్రమపడ్తున్నారని, ఆ క్రమంలో ఉన్మాదులుగా కూడా తయారవు తున్నారనీ ఆయన ఆవేదన చెందుతూంటారు.

ఎన్నో కళాఖండాలతో ఒక గొప్ప కళగా వెలుగొందిన సినిమా నేడు కేవలం వ్యాపారమై నందుకు ఆయన వ్యాకులపడుతుంటారు.

ఇలాంటి రమణారావులు ఇంకెందరు ఆ రోజున టీవీ చూస్తూ వేదనపడ్డారో... ప్రకాశ రావు ఎందుకు వెండితెర ద్వారా ప్రేమ అనే మత్తుమందుని యువతకు అమ్ముతూ జేబులు నింపుకుంటున్నాడో...

ఏమన్నా అంటే తామేమీ సంఘ సంస్క ర్తలం కామని నిర్లజ్జగా ప్రకటించుకుంటున్నారు.

సరే, ఆ రోజు 'ప్రేమా జిందాబాద్' విజయో త్సవ సభ దిగ్విజయంగా జరిగిందని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

అతి త్వరలోనే మరో అద్భుతమైన ప్రేమ చిత్రాన్ని తీసేందుకు తనలో ఉత్సాహాన్ని నింపు కొని ఫిలింనగర్‌కి తిరిగివచ్చాడు ప్రకాశరావు.

* * *

అది ఒక అయిదు నక్షత్రాల హోటల్.

ఆ హోటల్లోని రెస్టారెంట్‌లో ఓ మూల టేబుల్ దగ్గర ఓ ప్రేమజంట 'స్వీట్ నథింగ్స్' చెప్పుకుంటోంది.

టేబుల్ పైన ఉన్న ఆహారపదార్థాల కంటే వాళ్లు ఒకరినొకరు చూపులతో, భావాలతో తింటున్నారని చెప్తే బాగుంటుంది.

ఆ అమ్మాయి ఒక కోటీశ్వరుడి కూతురు.

ఆ అబ్బాయి ధరించే కోటు కూడా కుట్టిం చుకోలేనివాడు.

ఆ అపరిపక్వ హృదయాలను సినిమాటిక్ ప్రేమ దగ్గరచేసింది.

తల్లిదండ్రులకు తెలియకుండా కొంత కాలంగా ప్రేమాయణం సాగిస్తున్నారు.

ఆ అమ్మాయి వయసు పంధొమ్మిది – ఆ అబ్బాయి వయసు ఇరవై ఒకటి.

'మన పెళ్లికి మీవాళ్లు ఒప్పుకుంటారని అనుకోను' సీరియస్‌గా అన్నాడు అబ్బాయి.

'ఎందుకు ఒప్పుకోరు? ఆ సంగతి నేను చూసుకుంటాగా' అభయమిచ్చింది అమ్మాయి.

'ఒప్పుకుంటే సరే. ఒప్పుకోకపోతే ఏం చేద్దాం?' అడిగాడు అబ్బాయి.

'లేచిపోదాం' ఠక్కున సమాధానమిచ్చింది అమ్మాయి.

'అమ్మో! లేచిపోవడమా? మీ నాన్న చాలా డబ్బు, పలుకుబడీ ఉన్నవాడు. నన్ను అడ్రసు లేకుండా చేస్తాడు' భయపడ్డాడు అబ్బాయి.

'నువ్వింత పిరికివాడివనుకోలేదు. ప్రేమలో ప్రధానంగా ధైర్యం కావాలి. మనం ఎన్ని సినిమాల్లో చూడడంలేదూ... ప్రేమికులు ప్రపంచాన్నెదిరించి, ఏకంకావడం. ఏ శక్తీ మనల్ని విడదియ్యలేదు. భయపడకు' భరోసా ఇచ్చింది అమ్మాయి.

'సినిమా డైలాగు బాగానే కొట్టావుగానీ, జీవితం సినిమా కాదు. ఇంట్లోంచి పారిపోతే మనం ఎలా బతుకుతాం? నాకు ఆస్తిలేదు, ఉద్యోగమూ లేదు...'

'వచ్చేటపుడు కొంత డబ్బు, నగలు పట్టుకొస్తాలే. వాటితో కొంతకాలం బండి లాగిద్దాం. తర్వాత సంగతి తర్వాత'.

'ఏమో, నాకు మాత్రం చాలా భయంగా ఉంది. మన ప్రేమ వ్యవహారం ఎక్కడికి దారి తీస్తుందోనని'.

'భయపడకు డియర్, అంతగా అవసరమైతే లీగల్ ప్రొటెక్షన్ తీసుకుందాంలే. మనిద్దరం మేజర్లం. మా ఇష్టం అంటే ఏవరూ ఏమీ చెయ్యలేరు. అయినా ఈ సీనంతా మావాళ్లు ఒప్పుకోకపోతే కదా. మా మమ్మీడాడీలకు నేనొక్కత్తెనే గారాలపట్టినని తెలుసుగా. నేను ఏది అడిగినా కాదనరు. మంచి టైం చూస్కుని మన విషయం కదుపుతాలే, కంగారుపడకు. ఇప్పటికే లేటయింది. ఇంక వెళ్దామా?'

'అంతా నీదే భారం డార్లింగ్'.

ప్రేమపక్షులు అక్కడి నుంచి ఎగిరిపోయాయి.

* * *

తండ్రి హుషారుగా ఉన్న మూడ్ కనిపెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది ప్రియ.

'డాడీ, మీతో కొంచెం మాట్లాడాలి' బెరుగ్గా అంది.

'ఏంటో చెప్పు తల్లీ' మురిపెంగా అన్నాడు ప్రకాశరావు.

'మరి... మరి...' అంటూ నీళ్లు నమల సాగింది.

'ఏంటో చెప్పరా' కూతుర్ని దగ్గరకు తీసుకుని తల నిమురుతూ అన్నాడు ప్రకాశరావు.

'నేనొకటి అడుగుతాను, కాదనరుగా'

'నా చిట్టితల్లి ఏదడిగినా కాదనను'.

'ప్రామిస్'

'ప్రామిస్'.

'నేనొక అబ్బాయిని ప్రేమించాను డాడీ. అతన్నే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను'.

కూతురు చెప్పిన విషయానికి ఖంగు తిన్నాడు ప్రకాశరావు. మెల్లిగా తేరుకుని 'ఏంటమ్మా నువ్వనేది?' అన్నాడు.

'అవును డాడీ, సీరియస్‌గానే చెప్తున్నా. కాదనకుండా మీరు మా పెళ్లి చెయ్యాలి'.

'ఎవరతను?'

కూతురు చెప్పిన వివరాలు విని విస్మయం చెందాడు ప్రకాశరావు.

'కోటీశ్వరుడి కూతురివి. కూటికి గతిలేని వాడిని కట్టుకుంటానంటావా? నో, నెవ్వర్... నా కంఠంలో ప్రాణం ఉండగా అది జరగదు. ప్రేమా లేదు, గీమా లేదు – వాటిని మరిచిపో' చిందులు తొక్కాడు ప్రకాశరావు.

'నువ్వేనా డాడీ అలా మాట్లాడుతున్నది... ప్రేమ ఎంతో గొప్పదని, అది ఆస్తులు అంతస్తులకు అతీతమైనదనీ నీ సినిమాల్లో సందేశమిచ్చావుగా... నేను దాన్నే నమ్మాను డాడీ'

అమాయకంగా అంది ప్రియ.

'పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. ఆ సినిమాలు తీసింది మనకోసం కాదు, జనం కోసం'.

'అంటే సొమ్ము మనకు, సందేశం జనానికా డాడీ' సూటిగా అడిగింది ప్రియ.

'తెలివిగా మాట్లాడుతున్నాననుకోకు. సిని మాలు తీయడమనేది నా బిజినెస్. ఏ సబ్జెక్ట్ సక్సెస్ అవుతుందనుకుంటే దానిని తీసుకుం టాను. ఇది కోట్లతో చేసే వ్యాపారం. చెత్త కథలు తీస్తే చిప్ప చేతికొస్తుంది. చిన్నపిల్లవు, నీకివన్నీ తెలియదు. తెలియాల్సిన పనీ లేదు. మన స్థాయికి తగ్గ సంబంధం చూస్తాను... అప్పటిదాకా నోర్మూసుకొని కూర్చో' రంకె లేసాడు ప్రకాశరావు.

'ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయని' మీ సినిమా కవిగారే చాలా చక్కగా చెప్పారు డాడీ. అది నీబోటివాళ్లకు బాగా వర్తిస్తుంది' రెట్టించింది ప్రియ.

'నాతో జంకూ గొంకూ లేకుండా మాట్లాడ్డా నికి నీకెంత ధైర్యమొచ్చిందే'.

'ప్రేమికులకు పిరికితనం ఉండకూడదని నీ సినిమాల్లో చెప్పావుగా డాడీ. కనుక నాకీ ధైర్యం నీ సినిమాల నుంచి వచ్చినదే...' నదు రూ బెదురూ లేకుండా బదులిచ్చింది ప్రియ.

అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లుగా ప్రకాశరావు ప్రతాపం పెళ్లాంపైకి మళ్లింది. 'ఇలాగేనా ఆడపిల్లను పెంచేది' అంటూ గద్దిం చాడు.

'పిల్ల బయటకెళ్లి ఏం చేస్తుందో పట్టించు కోకుండా ఎంతసేపూ మీ సినిమాలోకంలో మీరుంటారాయె. ఇంట్లో కూర్చునే ఆడదాన్ని, నేనేం చెయ్యగలను?' అంటూ భర్తకి తిరిగి వాత పెట్టిందామె.

'సరే, జరిగిందేదో జరిగిపోయింది. ఇక నైనా దానిని ఓ కంట కనిపెట్టి ఉండు' హుకుం జారీ చేసాడు ప్రకాశరావు.

అటు కూతురికీ గట్టి వార్నింగ్ ఇచ్చాడు.

* * *

అది ప్రకాశరావు కొత్తచిత్రం ప్రారంభ సంరంభం.

ముహూర్తపు షాట్‌కి సన్నాహాలు చేస్తు న్నారు.

గౌరవసూచకంగా కొందరు సినీపెద్దల్ని ఆహ్వానించాడు ప్రకాశరావు.

లోగడ చిత్రాల మాదిరే ఈ కొత్తచిత్రం కూడా బంపర్ హిట్ అవ్వాలని వారంతా ఆకాం క్షించారు.

ఆ సమయంలో ప్రకాశరావు సెల్ మోగింది – దానిని చెవిదగ్గర పెట్టుకున్న కొద్ది సెకన్లకు కుప్పకూలిపోయాడు ప్రకాశరావు.


సెట్‌లోని పెద్దా, చిన్నా అంతా అతడి చుట్టూ మూగారు.

ప్రాణం పోలేదని, స్పృహ తప్పాడనీ నిర్ధా రించుకున్నవారై అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కొద్దిసేపటికి స్పృహలోకి వచ్చిన ప్రకాశ రావు 'పేకప్' చెప్పేసి హుటాహుటిన ఇంటిదారి పట్టాడు.

* * *

ఎక్కడ, ఎప్పుడు, ఏ సంచలనం జరుగు తుందా పండగ చేసుకుందామని నిరంతరం అవురావురుమనే మీడియావారికి, మరీ ముఖ్యం గా ఎలక్ట్రానిక్ మీడియాకి మరో మహత్తర అవకాశం రానే వచ్చింది. పర్యవసానంగా క్షణా




లలో ఆ వార్త దేశమంతటా దావానలంలా వ్యాపించింది. తత్ సంఘటనపై ఎవరికి తోచిన రీతిలో వారు వ్యాఖ్యానాలు చేయసాగారు. ఇందరు మాట్లాడుతున్నా, పెదవి విప్పని వ్యక్తి ప్రకాశరావే. మీడియాకు ముఖం చాటేసాడు.

ఇదంతా టీవీలో చూస్తున్న రమణారావు గారి లాంటివారు ఏ విధంగా స్పందించాలో తెలీని సందిగ్ధంలో పడ్డారు... ఏది ఏమైనా ఇది వెండితెరపై విజృంభిస్తున్న విషసంస్కృతి ఫలితమని వారు వాపోయారు. నీవు నేర్పిన విద్యయె అన్న చందంగా తన చిత్రాల ద్వారా యువతరానికి నూరిపోసిన ప్రేమపాఠాలను తన కూతురు కూడా వల్లెవేయగలదని పాపం ప్రకాశరావు ఊహించలేకపోయాడు. తనదాకా వచ్చినపుడే నొప్పి తెలుస్తుంది మరి!

* * *

ఎప్పుడైనా, ఎక్కడికైనా చొచ్చుకుపోయే హక్కు తమకి మాత్రమే ఉన్నదని భావించే మీడియావారు ఆ యువజంట ఎక్కడ ఉన్నదీ పసిగట్టేసారు. ఇద్దరి నోళ్లలోనూ మైక్‌లను దూర్చేసి ప్రశ్నలవర్షం కురిపించసాగారు. ఏ ప్రశ్నకు ఎలా సమాధానమివ్వాలో తెలీక తికమకపడసాగారు ఆ కొత్త దంపతులు. వారు చెప్పిన దానికి తమ స్వంత వ్యాఖ్యానాన్ని జోడించి సీను మరింత రక్తికట్టిస్తున్నారు మీడియా మాంత్రికులు. వారి విన్యాసాలను అలా ఉంచితే, బుల్లితెరపై తన ముద్దుబిడ్డ మోముని చూసి మౌనంగా రోదిస్తున్నాడు ప్రకాశరావు.

'ప్రేమే నేరమౌనా? అని కూతురు వేస్తున్న ప్రశ్నకు ఏమని సమాధానం ఇవ్వాలో తెలియడంలేదు అతడికి. సినిమాకు సంబంధించినంతవరకైతే ప్రేమించడం నేరం కానే కాదని చాటాడు. కానీ దానిని తన జీవితానికి అన్వయించుకోవడమే జీర్ణించుకోలేనిదిగా ఉంది.

ఏది ఏమైతేనేం, కూతురు కొట్టిన దెబ్బతో నిస్సహాయుడైన తండ్రిగా మిగిలిపోయాడు... ది గ్రేట్ ప్రొడ్యూసర్, డైరెక్టర్ ప్రకాశరావు. ●